క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఓబిలేసు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఫిర్యాదుల కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని తహసీల్దార్ సూచించారు. ఫిర్యాదు పత్రాల్లో ప్రజలు తప్పకుండా ఆధార్, సెల్ ఫోన్ నంబర్లను నమోదు చేయాలన్నారు.

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవ రెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజలు కార్యాలయానికి అర్జీలు తీసుకు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అర్జీలు స్వీకరించి సరైన సమాధానం చెప్పాలన్నారు.

‘కోటంక’లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు నీలం సంజీవరెడ్డి జయంతి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో సోమవారం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం గ్రామస్తులు మాట్లాడుతూ కల్లూరు సంజీవరెడ్డి సర్కిల్లో భారత దేశ మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా పార్టీలకు అతీతంగా ఘనంగా నివాళులర్పిస్తామన్నారు. మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు , కార్యకర్తలు హాజరై వేడుకలు జయప్రదం చేయాలన్నారు.

జోహార్ మురళి నాయక్



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఇండియా, పాకిస్తాన్ మధ్య యుద్ధంలో జవాన్ మురళి నాయక్ వీర మరణం పొందిన నేపథ్యంలో ఆయనను స్మరించుకుంటూ ఆదివారం రాత్రి మండలంలోని గుండాల తండా గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గుంతకల్లు పిరమిడ్ మార్నింగ్ వాకర్స్ అసోషియేషన్, రిటైర్డ్ ఆర్మీ జవాన్ మోహన్ నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవదాయ భూములకు 21న కౌలు వేలం

పామిడి: మండలంలోని నెమళ్లపల్లిలో ఉన్న ఆంజనేయ, శ్వర, పోతులరాజు దేవదాయ భూములకు ఈ నెల 21న కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ ఏ క్రిష్ణయ్య ఆదివారం తెలిపారు. ఆరోజు స్థానిక ఆ ఆలయంలో ఉదయం 11 గంటలకు ఆ భూములకు బహిరంగ కౌలు వేలం ఉంటుందన్నారు. 2025–26, 27, 28 సంవత్సరాలకు నిర్వహించే వేలంలో పాల్గొన దలచిన వారు రూ.500 డిపాజిట్ చేయాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 9441012561 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రైడర్ యాప్‌లను బహిష్కరిద్దాం



యాప్ ఫ్లెక్సీలను చింపివేస్తున్న ఆటో డ్రైవర్లు

గుంతకల్లుటౌన్: ఆటోడ్రైవర్ల కడుపు కొట్టేలా పట్టణంలో కొత్తగా ప్రవేశపెట్టనున్న టౌన్ రైడ్ యాప్‌లను బహిష్కరించి ఆటోవాలాలకు అండగా నిలవాలని సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, ఆటోయూనియన్ నేతలు వీరేష్, హరి, మోహన్ కోరారు. టౌన్ రైడ్, ఇతర రైడర్ యాప్‌లను వ్యతిరేకిస్తూ ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో ఆటోకార్మికులు నిరసన తెలిపారు. పట్టణంలో టౌన్ రైడ్ సంస్థ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కాల్చివేశారు. వారు మాట్లాడుతూ ఫైనాన్స్ కంపెనీల నుంచి అప్పుచేసి కొనుగోలు చేసిన ఆటోల ద్వారా జీవనాన్ని సాగిస్తున్న డ్రైవర్ల కడుపుకొడుతున్న రైడ్ యాప్‌లను ప్రజలు వ్యతిరేకించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు ఎస్.కె.ఎం.బాషా, రాజేష్, వెంకీ, బాబీ, కుమార్, గాదిలింగ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ దోపిడీకి.. అడ్డుకట్ట పడేనా..?



- హైకోర్టు ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం
- అడ్డగోలుగా ఫీజుల వసూలు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

తాడిపత్రిటౌన్: విద్యను వ్యాపారంగా మలచి.. తల్లిదండ్రులను పీల్చిపిప్పిచేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖాధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో యాజమాన్యాల ఆగడాలు మితిమీరాయి. దీంతో ఈ ఏడాదైనా ప్రైవేట్ పాఠశాలల అడ్డుగోలు దోపిడీకి అడ్డుకట్ట పడేనా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హైకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అడ్డుగోలుగా ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నా... పాఠశాలలోనే అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాడిపత్రి నియోజకవర్గంలో దాదాపు 97 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా.. వాటిలో దాదాపు సగానికి పైగా ప్రభుత్వ అనుమతులు లేకుండానే నడుస్తున్నాయి. కొంత మంది విద్యావేత్తల ముసుగులో రేకుల షెడ్‌లలో ఇరుకు భవనాల్లో ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తూ అడ్డుగోలు వ్యాపారానికి తెరలేపారు. కొందరు ఒక్కచోట పాఠశాలకు అనుమతి పొంది బ్రాంచ్‌ల పేరుతో రెండు మూడు పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. తల్లిదండ్రులు వేల రూపాయలు ఫీజుల రూపంలో చెల్లిస్తున్నా.. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యాయి. కనీసం మూత్ర విసర్జనకు వెళ్లాలన్నా క్యూలో వెళ్లాల్సిన దుస్థితి ఉంది. కొన్ని పాఠశాలలు శిథిలావస్థ భవనాలు, రేకుల షెడ్‌లలో నిర్వహిస్తుండటంతో అనుమతులు ఎలా వచ్చాయన్న సందేహాన్ని తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారుల ఈసారైనా చెల్లుబాటు కాని ప్రైవేట్ పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తాడిపత్రిలో రేకుల షెడ్‌లో తరగతులు నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల (ఫైల్)

అనుమతి రద్దు చేయాలి



తాడిపత్రిలో విద్యాశాఖ అధికారులు ఈ ఏడాదైనా కళ్లు తెరవాలి. రేకుల షెడ్‌లు, ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల అనుమతులు రద్దుచేయాలి. పుస్తకాలు, యూనిఫాం విక్రయాలతో విద్యాసంస్థలు చేస్తున్న వ్యాపారాన్ని అడ్డుకట్ట వేయక పోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం. అర్హతలున్న వారినే ఉపాధ్యాయులుగా నియమించుకోవాలి.
– నరసింహ, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ సెక్రటరీ

అధిక ఫీజులను నియంత్రించాలి



నాకు ఇద్దరు కొడుకులు. ఒక్కడు 9వ తరగతి చదువుతున్నాడు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేస్తున్నాయి. పుస్తకాలు, యూనిఫాం అంటూ వ్యాపారం చేస్తున్నాయి. విద్యాశాఖ అధికారులు స్పందించి అధిక ఫీజులను నియంత్రించాలి.
– విశ్వనాథ్, విద్యార్థి తండ్రి, నందలపాడు

గార్లదిన్నెలో భారీ వర్షం

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈసందర్భంగా ఆదివారం మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ మాట్లాడుతూ మండలంలో 36 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. కొప్పలకొండ, బూదేడు, మర్తాడు గ్రామాల్లో 12 హెక్టార్లల్లో వరి పంట నష్టం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది పర్యటించి పంట నష్టం నమోదు చేశామన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున తేమను సద్వినియోగం చేసుకుని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలన్నారు.

గుత్తిలో 8.8 ఎం.ఎం. వర్షపాతం

గుత్తి: గుత్తిలో శనివారం అర్ధరాత్రి తర్వాత వర్షం కురిసింది. 8.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రోడ్లపై వర్షం నీరు ప్రవహించింది. కూరగాయల మార్కెట్ పూర్తి గా చిత్తడిగా మారిపోయింది. అయితే ఈ వర్షంతో వాతావరణం చల్లబడి ప్రజలు కాస్త ఉప శమనం పొందారు.



గుత్తిలో చిత్తడిగా మారిన కూరగాయల మార్కెట్

రాత్రి బస్సు పునరుద్ధరించండి

యల్లనూరు: తాడిపత్రిలో రాత్రి 8.30 గంటలకు బయల్దేరి యల్లనూరు మీదుగా సింహాద్రిపురంలో రాత్రి బస చేస బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఆర్టీసీ డీఎం నందినిని ప్రయాణికులు కోరారు. రోజూ తెల్లవారుజామున 5 గంటలకు యల్లనూరుకు వచ్చేదని ఆస్పత్రులతోపాటు వివిధ పనుల మీద తాడిపత్రికి వెళ్లేవారికి అనుకూలంగా ఉండేదన్నారు.

నేటి నుంచి కుంభాభిషేకం

యల్లనూరు: మండలంలోని హనుమాన్ ఆలయంలో సోమవారం నుంచి గురువారం వరకూ హనుమజ్జయంతి సందర్భంగా మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకుడు పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు.

ప్రేమ వ్యవహారం.. ఇరువర్గాలపై కేసు

నార్పల: ప్రేమ వ్యవహారినికి సంబంధించి చోటుచేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని దుగుమర్రిలో మూడు రోజుల క్రితం శివ శంకర్, ప్రశాంతి అనే ఓ ప్రేమ జంట ఇళ్లు వదిలి వెళ్లారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఘర్షణ పడటంతో ఆదివారం పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. శివశంకర్ కుటుంబ సభ్యులైన మహేష్, మల్లికార్జున, నల్లప్పకు తీవ్ర గాయాలవడంతో జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడికి పాల్పడిన ప్రశాంతి తరపున నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

గుంతకల్లు: స్థానిక సంజీవ్‌నగర్‌లో సురేష్ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న సందులో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారింది. దాదపు 8 నెలల క్రితం వాటర్ ట్యాంకుకు ఏర్పాటు చేసిన విద్యుత్ బాక్స్ కాలిపోయింది. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోయారు. అసలే వేసవి కాలం కావడంతో ఐదురోజులకు ఒకసారి కూడా కొళాయిలకు నీరు వదలుతున్నారు. వాటర్‌ట్యాంకు అందుబాటులో ఉంటే కనీసం నితావసరాలకు ఉపయోగపడుతుంటుదన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి ట్యాంకును అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పొంచి ఉన్న ప్రమాదం



యర్రగుంట్ల వద్ద ప్రమాదకంగా ఉన్న ఇల్లూరు కాలువ

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో పెనక చెర్ల డ్యాంకు వెళ్లే దారిలో ఇల్లూరు కాలువకు ఉన్న సైడ్ వాల్స్, బ్రిడ్జి శిథిలమై కుంగడంతో ప్రమాదం పొంచి ఉంది. సింగిల్‌గా ఉన్న రోడ్డుపై పెనకచెర్ల, డ్యాం, కొత్తపల్లి, కొప్పలకొండ, కేశవా పురం కమలాపురం, కొట్టాలపల్లి, కె.కె. తండా గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది వాహ నాల్లో గార్లదిన్నెకు రాకపోకలు సాగిస్తున్నారు. సైడ్ వాల్స్ లేక పోవడంతో గతంలో కాలువ వద్ద అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడిన సంఘటనలున్నాయి. అలాగే అర్అండ్‌బీ అధికారులు తారు రోడ్డు ప్యాచ్ వర్కులు చేసినా ఇక్కడ సైడ్ వాల్స్ నిర్మించక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువకు మరమ్మత్తులు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

దత్తపాదుకా క్షేత్రంలో రేపు పూజలు

పామిడి: పట్టణంలోని దత్తపాదుకా క్షేత్రంలో ఈనెల 20న బహుళ అష్టమిని పురస్కరించుకుని నిర్వహించే పూజా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు ఎంహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, ఎస్ఎస్ఎం శ్రీధర్ ఆదివారం తెలిపారు. ఆరోజు ఉదయం మహా గణపతి పూజ, అనఘా లక్ష్మీ సమేత దత్తాత్రేయ స్వామి పంచామృతాభిషేకం, అనఘాష్టమి వ్రతం ప్రారంభం వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ఈ నెల 26న మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ 83వ జన్మదినం పురస్కరించుకుని ఉదయం భగవద్గీత 12వ అధ్యాయంలోని శ్లోకాలకు సంబంధించి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 1 గంటకు మహా మంగళహారతి అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని దత్తాత్రేయుని అనుగ్రహం పొందాలని వారు కోరారు. అదనపు సమాచారం కోసం 9440285921, 9441166600, 9398520472, 9703340653 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అధికారులూ.. ప్రొటోకాల్ పాటించరా?

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ విమర్శలు వెలువెత్తుతున్నాయి. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కరువు మండలాలు ప్రకటించగా అందులో బీకేఎస్, నార్పల ఉన్నాయి. ఆయా మండలాల్లోని రైతులకు పశు సంవర్ధక శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీతో మంజూరైన పశు దాణా మండలానికి వచ్చింది. బీకేఎస్ మండల పశు సంవర్ధక శాఖ అధికారులు రైతులకు దాణా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అయితే జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీలకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా కేవలం టీడీపీ నాయకుల చేత పశు దాణాను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ పథకాల పంపిణీలో అధికారులు ప్రొటోకాల్ పాటించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా బీకేఎస్ పశు సంవర్ధక శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా ప్రజలకు పంపిణీ చేయాల్సి ఉంది. ఆ నిబంధనలు వెటర్నరీ అధికారులు ఏమాత్రం పాటించడం లేదని మండలవాసులు చర్చించుకుంటున్నారు.



టీడీపీ నాయకుల చేతుల మీదుగా దాణా పంపిణీ చేస్తున్న వెటర్నరీ అధికారులు

తాగునీటి బోరుకు మరమ్మతులు

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి, ఈశ్వరపల్లి గ్రామాల్లో తాగునీటి బోర్లకు ఆదివారం మరమ్మతులు చేశారు. ఈశ్వరపల్లి గ్రామ శివారులోని శివారెడ్డి తోటలో గ్రామానికి నీటిని సరఫరా చేసే బోరు మోటారు కాలిపోయింది. దింతో మూడు రోజులుగా నీరు సరఫరా నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా పి.ఎర్రగుడి ఎస్టీ కాలనీకి నీటిని సరఫరా చేసే బోరు వద్ద ఇనుప పైపులు పగిలిపోయి నీరు వృథాగా పోతూ ట్యాంకుకు నీటి సరఫరా చేసేందుకు ఆటంకం కలుగుతోంది. స్పందించిన సర్పంచ్ మోటా పాపన్న అధికారులతో మాట్లాడి చెడిపోయిన బోరును మరమ్మతు చేయించారు. బోరులో అదనంగా పైపులు ఏర్పాటు చేయించారు. స్టార్టర్‌కు కూడా మరమ్మతు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. నూతన పైపులు వేసి బోరు మరమ్మతు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



బోరుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

‘దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి’

పామిడి: సీపీఎం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ హర్తాల్ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పీ అనిమిరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు ఏపీ రైతుసంఘం మండల అధ్యక్షుడు కే చంద్రమోహన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. రైతులు పండించే పంటలకు మద్దతుధర ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల రూ.20 వేలు పెట్టుబడి సాయం తక్షణం అందజేయాలన్నారు. నూతన కౌలుచట్టం తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 20న మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించే నిరసన కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా కర్షక, కార్మికులు, అనుబంధ సంఘాలు పెద్దత్తున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మల్లేసు, పీట్ల శివకుమార్, నరసింహుడు, దస్తగిరి, ఈశ్వరయ్య, ఆర్ ముత్యాలు, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదు



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ప్రగతి మైత్రి సంఘం సభ్యులు

గుంతకల్లుటౌన్: హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష వీడాలని అధికారులు సూచించారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం సందర్భంగా ప్రగతి మైత్రీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌తో మరణించిన వారి స్మృతి చిహ్నంగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు అశ్వక్‌హుసేన్, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, మైత్రీ సంఘం ప్రాజెక్టు మేనేజర్ రమేష్, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ పీరానాయక్, సిబ్బంది, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పనలో విఫలం



పుట్లూరులో కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

శింగనమల: రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి మండిపడ్డారు. ఆదివారం పుట్లూరులో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేటివ్ గుప్పిట్లో ఉంచారన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పెద్దయ్య, సీఐటీయూ నాయకులు రాఘవరెడ్డి, వెంకట చౌదరి, జే.పెద్దయ్య, ఆదినారాయణ, రంగప్ప , నాగముని తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో కోతుల బెడద

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్‌లో రోజు రోజుకూ కోతుల బెడద అధికమవుతున్నదని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. గుత్తిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోతులు గుంపులు , గుంపులుగా రైల్వే స్టేషన్‌లో చేరుతున్నాయన్నారు. రైల్వే ప్రయాణికుల వస్తువులను లాక్కెళ్లుతున్నాయన్నారు. ప్రయాణికులపై దాడులు చేస్తున్నాయన్నారు. దీంతో తినుబండారాలను తీసుకెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. కోతుల బెడదను నివారించడానికి రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళ మృతి



ఈశ్వరమ్మ మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఈశ్వరమ్మ(52) అనే మహిళ ఆదివారం వేకువజామున మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం ఆరో రోడ్డుకు చెందిన ఈశ్వరమ్మ పని నిమిత్తం ఈ నెల 1న భర్తతో కలసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. కొత్తపేట గ్రామ శివారులో వెనుక కూర్చున్న ఆమె జారి పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను గుత్తి ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడ 17 రోజులుగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ వితరణ

యాడికి: మండల కేంద్రంలోని మార్కెట్ వీధిలో ఉన్న దుర్గమ్మ ఇటీవల పక్షవాతానికి గురై మంచానికే పరిమితమైంది. మేఐహెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యుడు ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి స్పందించి ఆదివారం ఫౌండేషన్ తరపున ఆమెకు వీల్‌చైర్ అందజేశారు. ఫౌండేషన్ సభ్యులకు దుర్గమ్మ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సువార్త మహాసభలను జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని బైపాస్‌లో ఈ నెల 19,20,21 తేదీల్లో శాశ్వత కృపా పరిచర్య ఆధ్వర్యంలో నిర్వహించే సువార్త మహాసభలను జయప్రదం చేయాలని ఆ పరిచర్య నిర్వాహకులు ప్రభాకర్ ఛార్లెస్, విజయ్ ఛార్లెస్, పీటర్ విజయ్ ఆదివారం తెలిపారు. సువార్త సభలకు గుంటూరు యూదా మినిస్ట్రీస్ పాస్టర్ నెహెమ్యా ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేస్తారన్నారు. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి సువార్త సభలు ప్రారంభమవుతాయన్నారు. క్రైస్తవ విశ్వాసులు, క్రైస్తవేతరులు సువార్త సభల్లో పాల్గొని దైవాశీస్సులు పొందాలని వారు కోరారు.

సీఎస్ఐ చర్చిలో ఘర్షణ

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలోని నందలపాడులో రైల్వేస్టేషన్ వద్ద వున్న సీఎస్ఐ చర్చి సభ్యులు, పాస్టర్ మధ్య ఆదివారం ఘర్షణ నెలకొంది. చర్చి సభ్యులు ఇరువర్గాలుగా విడిపోయి వాగ్వాదం చేసుకున్నారు. దీంతో ఓ వర్గం సభ్యులు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పాస్టర్ విల్సన్‌పై ఫిర్యాదు చేశారు. పాస్టర్ విల్సన్ సొంతంగా కమిటీ ఏర్పాటు చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. అర్హులతో నూతన కమిటీ ఏర్పాటు చేసి అక్రమాలు జరగకుండా చూడాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బైలా ప్రకారం కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని ఇరువర్గాలను సీఐ సాయిప్రసాద్ హెచ్చరించారు. కాగా ఈ విషయమై పాస్టర్ మాట్లాడుతూ చర్చి ఆదాయానికి సంబంధించి ఎటువంటి అక్రమాలు జరగలేదన్నారు. కమిటీ సభ్యుల్లో విబేధాల వల్ల ఘర్షణ చోటుచేసుకుందన్నారు.